క్లుప్తంగా

పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలు హేయం



వర్ధన్నపేట : ప్రముఖ తెలుగు దినపత్రిక సాక్షి స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఏపీ ప్రభుత్వం వ్యవహరించడం హేయమని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్పీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లందాసు కుమార్ అన్నారు. పట్టణంలోని శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డికి నోటీసులు ఇవ్వకుండానే ఇంట్లో చొరబడి పోలీసులు సోదాలు నిర్వహించడాన్ని ఖండించారు. రాజ్యాంగం ప్రశ్నించే హక్కు పత్రికలకు కల్పించిందని తెలిపారు. అభ్యంతరాలుంటే చట్ట, న్యాయపరంగా ఎదుర్కోవాల్సిన ఏపీ ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పడం కక్ష సాధింపుగా ప్రజలు భావిస్తున్నారని చెప్పారు.

ఇల్లందలో కాటమయ్య ఉత్సవాలు ప్రారంభం



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలో గీత కార్మికులు గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో కాటమయ్య పండుగ ఉత్సవాలను శనివారం ప్రారంభించారు. డప్పు చప్పుళ్లతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి జలాభిషేకం చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలు మూడ్రోజుల పాటు నిర్వహిస్తామని గౌడ కులస్తులు తెలిపారు.

నేడు బీజేపీ కమిటీ ఎన్నిక

పర్వతగిరి : నేడు బీజేపీ మండల కమిటీని స్థానిక కార్యాలయంలో పూర్తిస్థాయిలో ఎన్నుకోనున్నట్టు మండల అధ్యక్షుడు చీమల భిక్షపతి యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ఇన్చార్జ్లుగా నాయకులు జలగం సంపత్రావు, దేవేందర్రెడ్డి హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. పార్టీతోపాటు అనుబంధ సంఘాలకు కమిటీలు నియమించనున్నట్టు వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ ఇన్చార్జ్లు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు లక్ష్మీనృసింహస్వామి జయంతి వేడుకలు

గీసుకొండ : మండలంలోని కొమ్మాలలో నేడు (ఆదివారం) శ్రీలక్ష్మీనృసింహస్వామి జయంతి వేడుక నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసచార్యులు, ఈఓ అద్దంకి నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు సుదర్శన నృసింహ హోమం, 10.30 గంటలకు శత కలశాభిషేకం, అనంతరం 108 కలశాలతో పంచామృత అభిషేకం నిర్వహిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందని వివరించారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

నర్సంపేట: అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మేనేజర్, ఏఈ, ఆర్ఐ నాయకులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణతో సత్ఫలితాలు

- రోజూ 80 మందికిపైగా హాజరు

పర్వతగిరి : వేసవి సెలవుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాలు సత్ఫలితాలిస్తున్నాయి. విద్యార్థులు శిక్షణను వినియోగించుకుని పలు అంశాల్లో రాణిస్తుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 19వ తేదీ వరకు మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో వేసవి శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు శిక్షణ పొందే అవకాశం కల్పించారు. ఈ క్రమంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకు చెందిన 6 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న సుమారు 90 మంది విద్యార్థులు శిక్షణా శిబిరంలో పేర్లు నమోదు చేసుకున్నారు. శిక్షణా శిబిరంలో విద్యార్థులకు స్పోర్ట్స్, యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, లైఫ్ స్కిల్స్, మ్యూజిక్, డ్యాన్స్, తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 80 మంది విద్యార్థులు శిక్షణకు హాజరవుతున్నారు. కొందరు విద్యార్థులు యోగా, వాలీబాల్, డ్యాన్స్, తదితర అంశాలపై దృష్టి కేంద్రీకరించి రాణిస్తున్నారు.



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

భవిష్యత్‌కు బంగారు బాటలు



శిక్షణ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. విద్యార్థులు వారికి నచ్చిన అంశాల్లో శిక్షణ పొందుతూ రాణిస్తున్నారు. స్పోర్ట్స్, యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, తదితర అంశాల్లో శిక్షణ విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి తోడ్పాటు అందిస్తోంది.

- మాంకాలి రామస్వామి, ఉపాధ్యాయుడు

ఉత్సాహంగా విద్యార్థుల హాజరు



విద్యార్థులు శిక్షణా శిబిరానికి ఉత్సాహంగా హాజరవుతున్నారు. రోజూ 80 మందికిపైగా శిక్షణ పొందుతున్నారు. వారికి ఆసక్తి ఉన్న అంశాల్లో ప్రత్యేక దృష్టి సారించి శిక్షణ ఇప్పిస్తున్నాం. శిక్షణ విద్యార్థుల ఉన్నతికి దోహదపడుతుందని చెప్పక తప్పదు.

- పాక రమేశ్‌బాబు, హెచ్ఎం

ఆస్పత్రికి అనస్థీషియా పరికరం అందిస్తా

- ప్రముఖ వ్యాపారవేత్త దొడ్డ మోహన్‌రావు

నర్సంపేట : నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి అనస్థీషియా పరికరం అందిస్తామని ఆస్పత్రి స్థల దాత, ప్రముఖ వ్యాపారవేత్త దొడ్డ మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రిలో పరికరాలు లేకపోవడంతో శస్త్రచికిత్సలు నిర్వహించడం లేదన్న విషయం తెలిసి ఆయన స్పందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోహన్‌దాస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను తెలుసుకున్నారు. త్వరలో పరికరాన్ని తన సొంత డబ్బుతో కొనుగోలు చేసి ఆస్పత్రిలో ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు.

విద్యాభ్యాసానికి భరోసా

పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ బాణాల ఇందిర కూతురు ఇంజనీరింగ్ విద్యాభ్యాసానికి ప్రముఖ వ్యాపారవేత్త మోహన్‌రావు భరోసా ఇచ్చారు. ఆమె భర్త రాంబాబు ఇటీవల మృతి చెందిన క్రమంలో తన కూతురు ఇంజనీరింగ్ ఫీజు చెల్లింపునకు సాయం అందించాలని మోహన్‌రావును ఇందిర కోరింది. ఈ క్రమంలో మోహన్‌రావు సూచన మేరకు ఇందిర కూతుర్లతో కలిసి శుక్రవారం హైదరాబాద్ వెళ్లి మోహన్‌రావును కలిసింది. ఇందిర కూతురు ఇంజనీరింగ్ అభ్యసించేందుకు కొంత ఆర్థికసాయం అందించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



మోహన్‌రావుతో ఇందిర, ఆమె కూతుర్లు

విద్యుత్ స్తంభాల ఏర్పాటులో నిర్లక్ష్యం

వర్ధన్నపేట : వ్యవసాయ బోరు బావికి విద్యుత్ సరఫరా కోసం ఓ రైతుకు అవసరమైన రెండు స్తంభాలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. అధికారులు తనను 10 నెలలుగా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని రైతు మీడియా ఎదుట వాపోయాడు. వివరాలిలా.. పట్టణానికి చెందిన రైతు బొంత చంద్రయ్య తన చిన్న కుమారుడికి పంచి ఇచ్చిన పొలంలో బోరు బావి వేయించాడు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా కోసం దూరం ఉండడంతో అధికారుల సూచన మేరకు రెండు స్తంభాల ఏర్పాటు కోసం డబ్బులు చెల్లించి డీడీ తీసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాడు. అయినా అధికారులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకుండా తాత్సారం చేస్తున్నారు. ఈ క్రమంలో చంద్రయ్య రెండో శనివారం సెలవు ఉంటుందని తెలియక విద్యుత్ కార్యాలయానికి చేరుకుని అధికారులు వస్తారనే ఆశతో ఎదురు చూస్తుండగా మీడియా గమనించడంతో రైతు గోడు వెళ్లబోసుకున్నాడు. ఇకనైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని రైతు కోరుతున్నాడు.



వివరాలను చూపుతున్న రైతు చంద్రయ్య

రేపు ఓంకార్ శత జయంతి సభ

దుగ్గొండి : రేపు (సోమవారం) మచ్చాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శత జయంతి సభ నిర్వహిస్తామని ఎంసీపీఐ(యూ) నర్సంపేట డివిజన్ కార్యదర్శి రాజా సాహెబ్ తెలిపారు. మండలంలోని రేబల్లెలో జయంతి సభ వాల్‌పోస్టర్లను నాయకులతో కలిసి శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకుడిగా, కమ్యూనిస్టుగా, ఎమ్మెల్యేగా ఓంకార్ పేదలకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఓంకార్ స్ఫూర్తితో బూర్జువా పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు ఐక్య ఉద్యమాలు నిర్మించాలని కోరారు. శత జయంతి సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గటిక కోటేశ్వర్, సిరిబొమ్మల భాస్కర్, పేరబోయిన అయిలోని, కొమురయ్య, మొగిలి, లాల్ మహ్మద్, చందర్‌రావు, అక్బర్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

'మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయాలి'

సంగెం : మండలంలోని గవిచర్ల సమీపంలోని రామచంద్రాపురం పరిధిలోని రాయినికుంట నుంచి భారీ యంత్రాలతో చెరువు మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయాలని ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి ఇస్మాయిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయినికుంట చెరువును ఆయన ఆధ్వర్యంలోని పార్టీ బృందం శనివారం సందర్శించి ప్రత్యక్షంగా పరిశీలించింది. అనంతరం ఇస్మాయిల్ మాట్లాడారు. రెండ్రోజులపాటు మట్టి తరలించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు పొంది గడువు ముగిసినా యథేచ్ఛగా మటిట తరలిస్తున్నారని చెప్పారు. మట్టి కోసం భారీ గోతులు తీస్తుండడంతో వర్షాకాలంలో చెరువులో నీరు నిలిచే అవకాశం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. ఊర చెరువులో గొయ్యిలు తీయడంతో గతంలో కాడెడ్లు, గేదెలు మృత్యువాతపడ్డాయని గుర్తు చేశారు. అధికారులు విచారణ చేపట్టి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అకాల వర్షంతో అన్నదాతల వెతలు

వర్ధన్నపేట : శనివారం సాయంత్రం అకస్మాత్తుగా కురిసిన జోరు వానకు అన్నదాతలకు వెతలు తప్పలేదు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యంపై పరదాలు కప్పడానికి, ధాన్యాన్ని కాపాడుకునేందుకు పరుగులు తీయడం కనిపించింది. వర్షం మామిడి రైతులను సైతం తీవ్ర నిరాశకు గురిచేసింది. పిడుగులు పడుతుండడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సుమారు గంటపాటు ఏకధాటిగా వర్షం కురిసిన క్రమంలో ఏ మేరకు నష్టం జరిగిందోనని వర్ష సమయంలో ఇళ్ల వద్దే ఉన్న రైతులు వేదనకు గురవుతున్నారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండల కేంద్రంలో దౌడు కట్టయ్య, మనుగొండకు చెందిన గుర్రపు రమేశ్, ఆరెపల్లి గ్రామస్తుడు నాగుర్ల బిక్కయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ప్రముఖ సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి శనివారం రూ.5 వేల చొప్పున సాయం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాలను బాలకిశోర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కోలా కుమారస్వామి, పాగాకు భిక్షపతి, దౌడు బాబు, సునీల్, రాజేశ్, మేకల బాబు, ప్రభాకర్, కోట ఐలయ్య, ప్రకాశ్, రాంబాబు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

దుగ్గొండి : విద్యుత్ ప్రమాదంలో గాయపడి హనుమకొండలోని అజరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని తొగర్రాయికి చెందిన తుమ్మలపెల్లి రామరాజును శాసనమండలి డిప్యూటీ చైర్మన్, ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు బండా ప్రకాశ్ శనివారం పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తొలుత రామరాజుకు అందిస్తున్న వైద్యంపై డాక్టర్లతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, నాయకులు బుస్సా మల్లేశం, మొగిలి, ఎన్ఆర్ఐ విభాగం కన్వీనర్ రాజ్‌కుమార్, తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రంలో విచారణ

వర్ధన్నపేట : 'డబ్బులు ఇస్తేనే ఖాళీ సంచులు' శీర్షికతో 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి స్పందించారు. స్థానిక పిరంగిగడ్డ ప్రాంతంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. రైతులు, నిర్వాహకులతో మాట్లాడి సమాచారం తీసుకున్నారు. సమస్య ఏమీ లేదని పలువురు రైతులు చెప్పినా సమగ్ర విచారణ చేపడతామని అదనపు కలెక్టర్ చెప్పారు. కాగా కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రైతులను మేనేజ్ చేశారన్న విమర్శలు అదనపు కలెక్టర్ చెవిన పడినట్టు తెలిసింది. ఇకనైనా రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సాక్షి ఎఫెక్ట్..



కొనుగోళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

అదనంగా పని చేస్తేనే పే స్లిప్పులు..?



నిరసన తెలుపుతున్న కూలీలు

- జాబ్ కార్డు రద్దు చేస్తామంటూ బెదిరింపులు
- 'ఉపాధి'లో వింత ధోరణి

నల్లబెల్లి : అదనంగా పని చేస్తేనే ప్లే స్లిప్పులు ఇస్తామంటూ కూలీలను ఇబ్బందుల పాల్జేస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లేకపోతే జాబ్ కార్డు రద్దు చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని కూలీలు వాపోయారు. మండలంలో ఉపాధి హామీ పనుల్లో వింత ధోరణి కనపడుతోందని కూలీలు శుక్రవారం పనులు నిలిపేసి నిరసన వ్యక్తం చేశారు. వివరాలిలా.. మండలంలోని ముచ్చింపులలోని ఊర చెరువులో ఈనెల 1 నుంచి 9వ తేదీ వరకు సుమారు 60 మంది కూలీలు ఫిష్ పాండ్ పనులు చేపట్టారు. అనంతరం శనిగకుంట చెరువులో సుమారు 100 మంది పూడికతీత పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో కూలీలు శుక్రవారం వేతనానికి సంబంధించిన స్లిప్పులు ఎందుకు ఇవ్వడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్ సారంగపాణిని నిలదీశారు. ఈనెల ప్రారంభంలో 6 రోజులు మాత్రమే పని చేశారని, మరో మూడ్రోజులు సాయంత్రం వేళల్లో అదనంగా పని చేస్తేనే నిబంధనల మేరకు రూ.270 చొప్పున అందుతుందని ఆయన స్పష్టం చేశారు. అదనంగా పని చేయాలనడం సరికాదని కూలీలు కక్కెర్ల పెద్ద సమ్మయ్య, తాళ్లపెల్లి అనిల్, బత్తిని మల్లికార్జున్, బత్తిని కుమారస్వామి, ఈరగోని లింగయ్య, బొనగాని రమేశ్, తదితరులు నిరసన వ్యక్తం చేయగా ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఉందని ఎఫ్ఏ సారంగపాణి తెలిపాడు. మూడ్రోజులు అదనంగా పని చేస్తేనే కూలీ డబ్బులు ఇస్తామని, లేదంటే జాబ్ కార్డులు రద్దు చేస్తామని ఎఫ్ఏ సారంగపాణి స్పష్టం చేయడంతో కూలీలు పనులు నిలిపేసి ఇంటిబాట పట్టారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి సమస్య పరిష్కరించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సంఘాల అభివృద్ధిలో చెల్లింపులు కీలకం

- సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి

నర్సంపేట : మహిళా సంఘాల అభివృద్ధిలో సభ్యుల చెల్లింపులు కీలకమని సమాఖ్య అధ్యక్షురాలు లింగాల శ్రీదేవి, ఉపాధ్యక్షురాలు పోపు రమాదేవి స్పష్టం చేశారు. పట్టణంలోని నెహ్రూ నగర్‌లోని కళాభారతి పొదుపు సంఘం 31వ వార్షిక మహోత్సవాన్ని అధ్యక్షురాలు మైస వసంత కుమారి అధ్యక్షతన శనివారం నిర్వహించగా శ్రీదేవి, రమాదేవి అతిథులుగా హాజరై మాట్లాడారు. రుణాలు తీసుకున్న సభ్యులందరూ సకాలంలో తిరిగి చెల్లించాలని సూచించారు. సభ్యులు నిబంధనలు పాటిస్తూ క్రమశిక్షణతో సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని చెప్పారు. అనంతరం సంఘం లావాదేవీల నిర్వహణలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న రావుల సుశీల, గుర్రపు అరుణలను అధ్యక్షులు, పాలకవర్గం శాలువాతో సత్కరించారు. అనంతరం అధ్యక్షురాలిగా ఆవుల విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా కాజీపేట అనితను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు బండారి అనిత, మంద అనిత, ఆకార మంజుల, ముత్యం కవిత, పద్మావతి, దూలం సుజాత, కొత్త సింధూర, చట్టబోయిన సరిత, కోశాధికారులు మల్లెల సుభాషిణి, వంగపండ్ల కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సాగర్

సంగెం : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాలోత్ సాగర్ కోరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలను మరింత ఉధృతం చేసిందన్నారు. కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేలా, కార్మికుల హక్కులను హరించేలా 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా సవరించి అమల్లోకి తీసుకొచ్చిందని విమర్శించారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా కార్మికులు సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేసి కార్మికులకు అన్యాయం చేసే చర్యలను ప్రజాస్వామికవాదులు ఖండించాలని కోరారు. సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులతోపాటు అన్ని వర్గాల ప్రజలూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో కార్మిక సంఘాల అధ్యక్షులు పోలెబోయిన శ్రీనివాస్, దుపాకి రాజు, మెట్టుపల్లి భాబు, నంగునూరి కుమారస్వామి, చిర్ర ప్రకాశ్, భానోత్ రమేశ్, చిర్ర సంపత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సంగెం : సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

గీసుకొండ : సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సాగర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమ్మెలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ మండల కన్వీనర్ బ్రహ్మచారి, నాయకులు దుబాయ్ రాజు, దేవయ్య, చిన్నగారి ప్రకాశ్, సదానందం, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ నేత్రాల అపహరణ

నర్సంపేట రూరల్ : ఆలయంలోని హనుమాన్ విగ్రహానికి చెందిన వెండి నేత్రాలు అపహరణకు గురైన ఘటన శుక్రవారం రాత్రి నర్సంపేటలోని వల్లభ్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రవికుమార్ కథనం ప్రకారం.. వల్లభ్‌నగర్ ఆలయంలోని హనుమాన్ విగ్రహానికి ఏర్పాటు చేసిన వెండి కళ్లను గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశారు. శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గరుడవాహన సేవ

గూడూరు : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి మూడో రోజు గరుడవాహన సేవను ఊరేగించారు. భక్తులు మండలంలోని పలు గ్రామాల నుంచి కుటుంబాలతో సహా భారీ సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాల్లో భాగస్వాములై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి వేణుగోపాలాచార్యులు, హనుమాన్ మాలాధరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవం

దామెర : మండలంలోని ఊరుగొండ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి శిఖర జీర్ణోద్ధారణ కలశ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు తూపురాణి శ్రీనివాసచార్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నృసింహస్వామి జయంతిని పురస్కరించుకుని స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, కల్యాణ మహోత్సవం, విశ్వక్షేన పూజ, అంకురార్పణ, సుదర్శన కలశ గ్రామ శోభయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 12వ తేదీన సోమవారం పుణ్యవచనం, పంచగవ్య ప్రాశనం, యాగశాల ప్రవేశం, దేవతాహ్వానం, అగ్ని ప్రతిష్ఠ, పంచపల్ల సహిత జలాధివాసం కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. 13న మంగళవారం మంటపార్చన, హోమాలు, మహాన్నపన విధి, ప్రసాద స్నపన విధి, ధాన్యాధివాసం, శయ్యాధివాసం, పుష్పాధివాసం నిర్వహిస్తామన్నారు. 14న బుధవారం రత్నన్యాపం, ధాతున్యాసం, బీజన్యాసం ఉదయం 9.9 గంటలకు పంచలోహ సహిత శ్రీ సుదర్శన శిఖర కలశ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ధాన్యం దిగుమతిలో తిరకాసు!

- తేమ, నల్లగా ఉందని మిల్లర్ల కొర్రీలు
- బస్తాకు 44 కిలోల చొప్పున కాంటాకు రైతులు లెటర్ రాసివ్వాలని నిబంధన
- అన్‌లోడింగ్.. ఆ తర్వాత మళ్లీ వెనక్కి
- రెండు రోజులు అన్నదాతల ఇబ్బందులు

ఖానాపురం: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకునేందుకు రైతులు అనేక కష్టాలు పడుతున్నారు. అక్రమాలను అన్నదాతలు ప్రశ్నిస్తే మిల్లర్లు అనేక కొర్రీలు పెడుతున్నారు. ధర్మరావుపేటలోని ఓ కేంద్రంలో బాలుతండాకు చెందిన ఐదుగురు రైతుల ధాన్యాన్ని 16 శాతం తేమతో కొనుగోలు చేశారు. బస్తాలను లారీలో లోడ్ చేసి నర్సంపేట మండలంలోని ఓ మిల్లుకు శుక్రవారం ఉదయం తరలించారు. కానీ, మిల్లు వద్దే అసలు కథ మొదలైంది. లారీలోని ధాన్యాన్ని పరిశీలించిన తర్వాత మిల్లర్లు తేమశాతం ఎక్కువగా ఉందని, నల్లగా ఉందని తిరకాసు పెట్టినట్లు తెలిసింది. మొదట బస్తాకు ఐదు కిలోల చొప్పున కోత పెట్టి దిగుమతి చేసుకుంటామని, లేకుంటే తమకు ధాన్యం వద్దని చెప్పడంతో రైతులు ఆందోళన చెందారు. నర్సంపేట పట్టణంలోని మరో మిల్లుకు తీసుకెళ్లారు. అక్కడ ధాన్యం మేం తీసుకోమని వారు సైతం కొర్రీలు పెట్టారు. చేసేదేమీ లేక మళ్లీ మొదట తీసుకెళ్లిన మిల్లుకే తీసుకెళ్లారు. ఐదు కిలోలు చొప్పున కోతపెట్టి తీసుకుంటామంటే రైతులు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బతిలాడారు. చివరకు బస్తాకు అదనంగా 2 కిలోల చొప్పున కోత పెడుతామని రైతులతో మాట్లాడారు. ఒక్కో బస్తాకు 44 కిలోల చొప్పున దిగుమతి చేసుకుంటామని తెలపడంతో రైతులు చేసేదేమీ లేక ఒప్పుకున్నట్లు తెలిసింది. కానీ, సదరు రైస్‌మిల్లర్ ఇదంతా రైతుల ఇష్టపూర్వకంగానే చేస్తున్నట్లు లెటర్ రాయించుకున్నాడు. విషయం బయటకు పొక్కడంతో దిగుమతి చేసుకున్న ధాన్యాన్ని మళ్లీ లారీలోకి లోడ్ చేయించి లారీని మిల్లు నుంచి బయటకు పంపించాడు. దీంతో రైతులు తమ ధాన్యం పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. రైస్ మిల్లు ఎదుట ధాన్యం లారీ రెండు రోజుల నుంచి ఉంటుందని, రోజుకు రూ.10వేల చొప్పున చెల్లించి ధాన్యాన్ని తీసుకువెళ్లాలని లారీకి సంబంధించిన వ్యక్తులు చెప్పడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సదరు మిల్లర్ ధాన్యాన్ని బయటకు పంపినట్లు తెలిసింది.



దిగుమతి కాకుండా లారీలో ఉన్న ధాన్యం



రైస్‌మిల్లర్‌కు రైతులు రాసిచ్చిన లెటర్

బతిమిలాడినా పట్టించుకోలేదు..

ఐదు ఎకరాల్లో 1224 సన్నరకం ధాన్యాన్ని సాగు చేశా. వచ్చిన దిగుబడిని ధర్మరావుపేట సెంటర్‌లో ఆరబెట్టి 264 బస్తాల్లో నింపి లారీలో నర్సంపేటకు తీసుకువచ్చాం. ధాన్యం నల్లగా ఉందని, తక్కువగా బియ్యం వచ్చే అవకాశం ఉందని మిల్లర్ తీసుకోనని చెప్పాడు. ఎంత బతిలాడినా పట్టించుకోలేదు. లెటర్ రాయించుకొని దిగుమతి చేసుకుంటానని తెలపడంతో చేసేదేమీ లేక ఒప్పుకున్నా.

- బానోత్ లాల్‌సింగ్, బాలుతండా, ఖానాపురం

ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద



బస్తాకు 40 కిలోలే తీసుకోవాలి : కలెక్టర్

వర్ధన్నపేట: ధాన్యం కొనుగోళ్లలో బస్తాకు 40 కిలోలే తీసుకోవాలని ఐకేపీ నిర్వాహకులను కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. ఎక్కువ తూకం వేసి రైతులకు నష్టం కలిగించవద్దని ఆమె స్పష్టం చేశారు. మండలంలోని ల్యాబర్తి, నల్లబెల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న భూ భారతి సదస్సుల్లో పాల్గొనడానికి శనివారం వచ్చిన కలెక్టర్.. ల్యాబర్తి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎందుకు ఎక్కువ తీసుకుంటున్నారని నిర్వాహకులను ప్రశ్నించారు. రైతుల ఇష్టపూర్వకంగానే ఎక్కువ తూకం వేస్తున్నామని నిర్వాహకులు చెప్పే ప్రయత్నం చేయగా ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ భారతి సదస్సుల్లో పాల్గొని రైతులకు ఆమె పలు సూచనలు చేశారు. రైతులు దరఖాస్తులు అందజేసి భూ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. అదేవిధంగా రైతు గుర్తింపు కార్డు రిజిస్ట్రేషన్ కోసం రైతులు తమ వివరాలను అందించాలని సూచించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్ విజయసాగర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.